క్లుప్తంగా

బాలుడిపై కుక్క దాడి

ఏలూరు టౌన్: ఏలూరు మాదేపల్లి ఇందిరాకాలనీలో బాలుడిపై కుక్క దాడి చేయటంతో తీవ్ర గాయాలయ్యాయి. పుట్టి అభిషేక్ (10) సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన ఇంటివద్ద రోడ్డుపై అడుకుంటూ ఉండగా కుక్క దాడి చేసింది. తీవ్ర గాయాలపాలైన బాలుడ్ని కుటుంబ సభ్యులు ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. బాలుడు ప్రస్తుతం హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్నాడు.

మైనర్లు వాహనాలు నడపటం నేరం



మైనర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్సైలు శ్రీనివాసరావు, శ్రీధర్

ఏలూరు టౌన్: మైనర్లు మోటారు సైకిళ్లు నడిపితే చర్యలు తప్పవని ఏలూరు ట్రాఫిక్ ఎస్సైలు శ్రీనివాసరావు, శ్రీధర్ హెచ్చరించారు. ఏలూరు ట్రాఫిక్ స్టేషన్ వద్ద మంగళవారం మైనర్లకు వారు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లు మోటారు సైకిళ్లు నడపటం నేరమని, వారి ప్రాణాలకు అపాయమని, ఎదుటివారి ప్రాణాలకు ముప్పు ఉంటుందని వివరించారు. ప్రతి తల్లిదండ్రులూ గమనించి, తమ పిల్లలకు మోటారు సైకిళ్లు ఇవ్వవద్దని, వాహన యజమానులు ట్రాఫిక్ నిబంధనలు అనుసరించాలని అన్నారు. ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మోటారు సైకిళ్ల పత్రాలను యజమానులు తమ వద్ద విధిగా ఉంచుకోవాలని సూచించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



మండల ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి

దెందులూరు: దెందులూరు మండలంలో జూలై 1వ తేదీ నుంచి జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై 16వ విడత సోషల్ ఆడిట్ జరుగుతుందని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఏపీఓ దశరథ రాంజీ అధ్యక్షతన నిర్వహించిన మండలస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్టేట్ రిసోర్స్ పర్సన్ చంద్రరాజు మాట్లాడుతూ దెందులూరు మండలంలో సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు ఒక స్టేట్ రిసోర్స్ పర్సన్, 9 మంది జిల్లా రిసోర్స్ పర్సన్లు మండలానికి వచ్చారన్నారు. విలేజ్ సోషల్ ఆడిటర్లను ఎంపిక చేస్తారన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై ప్రతి గ్రామంలోనూ గ్రామసభ నిర్వహించి సమీక్షిస్తారని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

దెందులూరు: ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మానవహక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ముప్పవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు చట్ట ప్రకారం పదోన్నతుల్లో రిజర్వేషన్లు తప్పనిసరి అని ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మానవహక్కుల పరిరక్షణతో పాటు వారిని సమాజంలో గౌరవించటమేనన్నారు. సమాజంలో అసమానతలు ఉన్నంతకాలం రిజర్వేషన్లు కొనసాగుతాయని మురళీకృష్ణ అన్నారు.

ఇన్‌కమ్ ట్యాక్స్ సడలింపుతో సంతోషం

- 6 అంచెల ధ్రువీకరణే అర్హత
- 4 నుంచి ఏలూరులో క్యాంపులు
- 11 రకాల సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవాలి
- ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా



శనివారపుపేటలోని వార్డు సచివాలయం భవనం

ఏలూరు టౌన్: పేదల ప్రజలకు సంక్షేమాన్ని అందించాలనే తపన.. తాపత్రయం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ప్రజలకు మరింత చేరువ చేస్తోంది. సంక్షేమ పథకాలకు గతంలో 7 అంచెల ప్రమాణికంగా తీసుకుని ఎంపిక చేయగా.. జగన్ సర్కారు తాజాగా ఇన్‌కమ్ ట్యాక్స్ నిబంధన సడలించటంతో ప్రజలకు మరింత మేలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమంలో 6 అంచెల ధ్రువీకరణలను పరిశీలించి, అర్హత ఉంటే పథకాలను అందించేలా ప్రత్యేక శ్రద్ధ వహించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఏలూరు నగరంలో జూలై 4 నుంచి జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆళ్ల నాని చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పథకాలకు లబ్దిదారుల ఎంపికలో అత్యధిక శాతం మంది ఇన్‌కమ్ ట్యాక్స్ కారణంగా అర్హత కోల్పోయారు. ఈ అంశాన్ని నిశితంగా పరిశీలన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తాజాగా ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రామాణికంగా తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేసింది. చాలామంది పిల్లల చదువులు, కుటుంబ అవసరాలకు బ్యాంకు లోన్లు, ఇతర కారణాలతో ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ దాఖాలు చేయటంతో ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సురక్ష క్యాంపులు ఇలా..

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో 80 సచివాలయాలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. 5 సచివాలయాలను క్లస్టర్‌గా గుర్తించారు. ఏలూరులో 16 రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో క్లస్టర్‌లో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. జూలై 4న ఎంఆర్‌సీ కాలని, 5న తోటకూరదొడ్లు, 6న తంగెళ్లమూడి, 7న ఐకేపీ భవన్, 10న లంకపేట, 11న ఫిలాస్‌పేట, 12న మోతేవారి తోట, 13న వంగాయగూడెం మున్సిపల్ స్కూల్, 14న పంపుల చెరువు ఏరియా, 15న గాంధీ జ్ఞాన మందిరం (పడమరవీధి), 17న ఉర్దూ షాదీఖానా, పెన్షన్‌లైన్, 18న జ్వాలాపహరేశ్వరస్వామి కాలని (పీహెచ్‌సీలో), 19న మెడికల్ అసోసియేషన్ బిల్డింగ్, 20న పోస్టల్ కాలనీ పార్క్, 21న శనివారపుపేట, 22న రాజరాజేశ్వరి కల్యాణ మండపం వద్ద క్యాంపులు నిర్వహించనున్నారు.

మరింత మెరుగైన సేవలు



పేదలకు మేలు చేయటమే ప్రధాన లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. రాజకీయ చరిత్రలో ఏ నాయకుడు చేయలేని వినూత్నమైన కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతూ వారికి మరింత చేరువ అవుతున్నారు. ఏలూరు నగరంలో ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వారి సమస్యలు తెలుసుకోవటంతోపాటు, వారికి సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– షేక్ నూర్జహాన్, మేయర్, ఏలూరు నగరం

అర్హులందరికీ పథకాలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనేకమంది పథకాలకు దూరమైన పరిస్థితి ఉండేది. ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయకత్వంలో ప్రతి పేదవానికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. మరోసారి ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించి అభివృద్ధికి మరింత కృషి చేస్తారు.

– దేవరకొండ శ్రీనివాసరావు, కార్పొరేటర్, 49వ డివిజన్, ఏలూరు

చోరీ కాదు.. హడావుడిలో బైక్ తీసుకెళ్లారు



మోటారు సైకిళ్లను అప్పగిస్తున్న సీఐ ఆదిప్రసాద్, ఎస్సై రామకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ వెన్నవల్లివారిపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలోని సిద్ధార్థ హాస్పిటల్ వద్ద ఒక వ్యక్తి మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ బోణం ఆదిప్రసాద్, ఎస్సై రామకృష్ణ తమ సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. గంటల వ్యవధిలోనే మోటారు సైకిల్‌ను వెతికిన పోలీసులు బాధితుడు చింతయ్యకు అప్పగించారు. మంగళవారం ఉదయం సిద్ధార్థ హాస్పిటల్ పక్కన మోటారు సైకిల్‌ను చింతయ్య పార్కింగ్ చేయగా వేరొక వ్యక్తి పక్కన ఉన్న తన మోటారు సైకిల్‌కు బదులు చింతయ్య బండిని తీసుకెళ్లాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన పోలీసులు చోరీ జరగలేదని గుర్తించారు. మరో మోటారు సైకిల్ యజమాని హడావుడిలో అతని బండిని తీసుకెళ్లినట్టు నిర్ధారించారు. యజమానులు ఉభయులకు తమ మోటారు సైకిళ్లు అప్పగించటంతో సంతోషం వ్యక్తం చేశారు.

జగన్ పాలనకు కొల్లేరు ప్రజల జేజేలు

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



సీసీరోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొఠారు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను కొల్లేరు ప్రజలు మెచ్చారని, రానున్న ఎన్నికల్లో మరోసారి అధికారం కట్టబెడతారని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఏలూరు మండలం పైడిచింతపాడులో రెండోరోజు ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సోమవారం రాత్రి గ్రామంలో పల్లె నిద్ర చేసిన ఎమ్మెల్యే, ఉదయం 7 గంటలకే ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. రూ.22.50 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన సీసీరోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఏ చిన్న సమస్య పరిష్కారానికయినా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన, సంక్షేమ పథకాలు చేరుస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల జనరంజక పాలనకు అన్నివర్గాల ప్రజలూ బ్రహ్మరథం పడుతున్నారని వివరించారు. దెందులూరు నియోజకవర్గం కొల్లేరు గ్రామాల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేశామన్నారు. అంతర్గత సీసీరోడ్లు, డ్రెయినేజీ, ప్రధాన రోడ్ల నిర్మాణం, సచివాలయాల ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి ఊరులోనూ జగనన్నకాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలను మెరక చేశామన్నారు. 15 గ్రామాల్లో సుమారు రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ ముంగర తిమోతి, ఉప సర్పంచ్ రేలంగి యోహాన్, మాజీ సర్పంచ్ ముంగర వెంకటేశ్వరరావు, మోరు కొండలరావు, సైదు వరదయ్య, పల్లెం రాజు, యాళ్ల భూషణరాజు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, పార్టీ బీసీసెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, తేరా ఆనంద్, ముంగర సంజీవ్‌కుమార్, మండల కొండలరావు, బాపనయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి, ఇంజినీరింగ్ అధికారులు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు



ప్రత్తికోళ్లలంక ప్రజలతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ మూర్తి

ఏలూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలని ఏలూరు మండల ప్రత్యేక అధికారి, ఏలూరు జిల్లా డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి ఆదేశించారు. మంగళవారం ఆయన ప్రత్తికోళ్లలంక, శ్రీపర్రు గ్రామాల్లో పర్యటించారు. జగనన్న సురక్ష కార్యక్రమాల ఏర్పాటు కోసం అవసరమైన కమ్యూనిటీ హాల్స్, స్థలాలను పరిశీలించారు. వలంటీర్లతో సమావేశం నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన సేవలను అడిగి తెలుసుకున్నారు. పలువురు గ్రామస్తులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, వేగంగా చేరతాయని, 11 అంశాల్లో ఎలాంటి రుసుం లేకుండా ధ్రువీకరణ పత్రాలు అందించనున్నామని తెలిపారు. గతంలో ఇలాంటి కార్యక్రమం ఎన్నడూ జరగలేదన్నారు.

ట్రాన్స్‌కో అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



ట్రాన్స్‌కో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా అంటూ దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ట్రాన్స్‌కో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏలూరు మండలం పైడిచింతపాడులో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు విద్యుత్ లోఓల్టేజ్ సమస్యపై ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన డీఈ టి.శశిధర్, ఏడీ త్రివాస్‌తో పాటు ఏఈ శ్రీనివాస్‌ను పిలిచి ప్రశ్నించారు. కొల్లేరు గ్రామాలకు విద్యుత్ లో ఓల్టేజ్ సమస్య ఎందుకు పరిష్కరించడం లేదన్నారు. లో ఓల్టేజ్ సమస్య నివారించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుడివాకలంకలో ప్రత్యేక సబ్‌స్టేషన్ మంజూరు చేసినప్పటికీ ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఇందుకోసం సుమారు రూ.4 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. దీనిపై స్పందించిన అధికారులు టెండర్ ప్రక్రియపై ఉన్నతాధికారులతో మాట్లాడాలని కోరారు. కొల్లేరు గ్రామాల ప్రజలకు 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఉన్నతాధికారులను కోరారు. లో ఓల్టేజ్ సమస్య రాకుండా చూడాలన్నారు. కొద్దిరోజుల్లో సబ్‌స్టేషన్ పనులు చేపట్టాలన్నారు.

ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం



అరుంధతీ పేటలో మహిళ సమస్యపై స్పందిస్తున్న పెదబాబు, చిత్రంలో కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వినూత్నంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏలూరు నగరంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని సూచనలతో 50వ డివిజన్‌లో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం ఉదయం, సాయంత్రం రెండు పూటలా డివిజన్‌లో ప్రతి ఇంటినీ సందర్శించారు. డివిజన్‌లోని వలంటీర్లు, గృహసారధులు, సచివాలయ సెక్రటరీలను 8 బృందాలుగా ఏర్పాటు చేసి 24 క్లస్టర్లుగా విభజించి, ప్రతి ఇంటికీ వెళ్లారు. ప్రజల సమస్యలు, సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో ఆరా తీశారు. అడిగారు, ఇంకా వారికి ఏమి అవసరమో తెలుసుకున్నారు. గవరపేట ప్రాంతంలో ప్రజలు తమ సమస్యలను పెదబాబు దృష్టికి తీసుకొచ్చారు. కొత్తగా జంటల పేర్లను తమ కుటుంబ రేషన్ కార్డు నుంచి తొలగించి, కొత్త కార్డు ఇవ్వాలని, కొందరు బర్త్ సర్టిఫికెట్‌లో పేరు సరిచేయాలని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, తదితర అంశాలను తెలిపారు. సాయంత్రం వేళ అరుంధతీపేటలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి వలసదారులు తమ రేషన్‌కార్డులు మార్పించాలని కోరారు. కుటుంబంలో ఇద్దరు కుమారులు తల్లిదండ్రులు ఒకే రేషన్‌కార్డులో ఉండడంతో వారికి ఇంటి స్థలం రాలేదని చెప్పారు. ఈ సమస్యలను జగనన్న సురక్ష క్యాంపులో పరిష్కరిస్తామని, ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని కోఆప్షన్ సభ్యులు పెదబాబు వారికి భరోసా ఇచ్చారు.

ఫలిస్తున్న విద్యా సంస్కరణలు



విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందుబాటులోకొచ్చిందని కార్పొరేటర్ ఆయేషా సుల్తానా రియాజ్, వైఎస్సార్‌సీపీ ఏలూరు మైనార్టీ సెల్ అధ్యక్షుడు రియాజ్ అలీ ఖాన్ అన్నారు. స్థానిక 46వ డివిజన్‌లోని మౌలానా అబ్దుల్ కలాం ఉర్దూ పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ, తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ ప్రవేశ పెట్టిన విద్యా సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాకానుకగా యూనిఫారం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, స్కూల్ బ్యాగ్ తదితర విద్యా వస్తువులను అందజేశారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన జగనన్న ఆణిముత్యాలకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ఆర్ఎం చౌదరి, ఎస్ఎంసీ చైర్మన్ యాసీన్, వైస్ చైర్మన్ ఫర్హానా పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి వినతి

దెందులూరు: స్పందన, ఎమ్మెల్యే కార్యాలయానికి అందిన వినతులను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు విని, వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. స్పందన, ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అర్జీలను పరిష్కరించడంలో ఉద్యోగులు అలసత్వం వహించరాదన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలన్నారు. నాలుగు మండలాల నుంచి ప్రజలు సమస్యలపై వినతిపత్రాలు ఎమ్మెల్యేకు అందజేశారు.

చేనేత, హస్త కళలను ఆదరించాలి



చేనేత, హస్తకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎస్ఎంఆర్ పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారతదేశ చరిత్ర, సంస్కృతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే చేనేత, హస్త కళలను, కళాకారులను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శ్రీకళాభారతి హస్తకళా చేనేత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిల భారత హస్తకళా చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వివిధ సంస్కృతులను ప్రతిబింబించేలా ఆయా ప్రాంతాల కళాకారులతో ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శ్రీకళా భారతి హస్తకళా చేనేత కళాకారుల సంఘం అధ్యక్షుడు రుద్రోజు ప్రసాదరావు మాట్లాడుతూ పోచంపల్లి, గద్వాల, ఉప్పాడ, మంగళగిరి, ధర్మవరం తదితర ప్రాంతాల చేనేత వస్త్రాలు, కొండపల్లి, ఏటి కొప్పాక కొయ్య బొమ్మలు, సహరాన్‌పూర్ వుడ్ కార్వింగ్ వస్తువులు బంజార ఎంబ్రాయిడరీ వంటి సుమారు 200 రకాల హస్తకళలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని చెప్పారు. ఉత్పత్తి ధరలకే లభ్యమయ్యే వస్త్రాలు, వస్తువులను నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని కళాకారులకు చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, ప్రదర్శన నిర్వాహకుడు ముద్దాడ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవోలు ఛానల్‌ను అభివృద్ధి చేయండి

పెదపాడు: మండలంలోని సత్యవోలు కేతు కెనాల్ ఛానల్ హెచ్ ప్రాంతాన్ని మంగళవారం ఉదయం జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, ఇరిగేషన్ డీఈ కొడాలి బాబు, ఏఈ సూర్యతేజ్‌తో కలిసి ఆయకట్టు ప్రాంత రైతులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. రైతుల సూచనల మేరకు హెచ్ ఛానల్‌కు మరమ్మతులు చేపట్టాలని హైడ్రాలిక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కోరారు. విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీర్‌కు ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఛానల్ పరిధిలో వసంతవాడ, సత్యవోలు, సకలకొత్తపల్లి, కొణికి రాజుపేట గ్రామాలకు చెందిన సుమారు 3,500 ఎకరాల ఆయకట్టు ఉందని రైతులు చెప్పారు. ఏటా సక్రమంగా నీరందక దిగుబడి నష్టం జరుగుతోందని చెప్పారు.

జగనన్న ఆణిముత్యాలకు నగదు బహుమతులు



జగనన్న ఆణిముత్యాలకు నగదు బహుమతులు అందిస్తున్న విద్యాశాఖాధికారులు

పెదపాడు: ప్రతిఫలాపేక్ష లేకుండా విద్యార్థుల కోసం రూ.వేల కోట్లు ఖర్చుచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ, ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగనన్న ఆణిముత్యాలు పథకంలో ప్రతిభచూపిన విద్యార్థులకు నగదు బహుమతులు, జగనన్న విద్యా కానుక అందించారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి, డీవీ రమణ, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని గుర్తించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చెప్పారు. ఉత్తమ ఫలితాలను అందించిన విద్యార్థులను ఎంఈఓలు ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన ఎంఈఓలుగా బాధ్యతలు చేపట్టిన దేవినేని రమణ, సబ్బితి నర్సింహమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారావు, పీ సుబ్రహ్మణ్యం, విద్యాకమిటీ చైర్మన్ ఆర్‌వీ నాయుడు పాఠశాల సీనియర్ ఉపాధ్యాయిని జీ విజయ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	31
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	29
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	33
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	15